AMMA NEWS
డిజిటల్
FLASH EDITION
WWW. AMMADAILY.COM
EVENING 5PM
ఆదివారం
13 ఆగస్టు 2023



# ఆ మూడింటిపై.. కేసీఆర్ ఫోకస్

- 18 తర్వాత స్పష్టత
- బీఆర్ఎస్‌లో జోరుగా చర్చ
- గజ్వేల్ నుంచి పోటీ అనుమానమే

శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గర పడింది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అభ్యర్థులు, గెలుపు గుర్రాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులు, వారి విజయావకాశాలపై ప్రధానంగా ఫోకస్ పెట్టిన పార్టీలు జాబితాలపై దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలో ఈసారి సీఎం కేసీఆర్ పోటీ చేసేది ఎక్కడ? అన్న అంశంపై జోరుగా చర్చ జరుగుతోంది. తెరమీదకు ఆ మూడు నియోజకవర్గాల పేర్లు ప్రధానంగా వస్తుండటంతో ఆయా నియోజకవర్గాలలో నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న విపక్ష పార్టీల అభ్యర్థులు కొంత తడబడుతున్నారు.

ప్రత్యేక ప్రతినిధి అమ్మన్యూస్ 2లో



2లో

అభివృద్ధిలో ఆదిలాబాద్ లాస్ట్..

# కాంగ్రెస్‌తోనే.. అభివృద్ధి సాధ్యం

: కంది శ్రీనివాస రెడ్డి స్పీచ్‌కు జనం ఫిదా

# కాషాయానికి షాకులు తప్పవా..

- రాజీనామాల యోచనలో పలువురు నేతలు
- సంజయ్ మార్పు తర్వాత కల్లోలంలో కమలం
- శూన్యమైన దిద్దుబాటు చర్యలు



2లో

ప్రత్యేక ప్రతినిధి అమ్మన్యూస్ 2లో

ప్రత్యేక ప్రతినిధి అమ్మన్యూస్ 2లో




# మాజీ మంత్రి ఇంటికి పీసీసీ చీఫ్

- ఏ చంద్రశేఖర్ తో 10 నిమిషాలు రేవంత్ భేటీ
- కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం

2లో

## కాషాయానికి
# షాకులు తప్పవా..



**ప్రత్యేక ప్రతినిధి / అమ్మన్యూస్ :** ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో కాషాయ పార్టీలో కల్లోలం రోజురోజుకూ పెరిగిపోతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్ ని అధిష్టానం తప్పించిన తర్వాత శ్రేణులు పూర్తిగా కుంగిపోయాయి. ఎక్కడో ఉన్న బీజేపీని తెలంగాణలో ఎక్కడికో తీసుకు వెళ్ళిన సంజయ్ ని హఠాత్తుగా పదవీచ్యుతిని చేయడాన్ని రాష్ట్ర పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. అధికార బీఆర్ఎస్ కు కంటి మీద కునుకు లేకుండా చేయడమే కాకుండా అడుగడుగునా పాలకుల తీరును ఎండగట్టిన సంజయ్ ని పదవి నుంచి తప్పించడం పార్టీ అధిష్టానంపై కేసీఆర్ వత్తిడి ఉందన్న ప్రచారం జోరందుకున్న నేపథ్యంలో ప్రస్తుతం బీజేపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కుంటోంది.

హఠాత్తుగా నాయకత్వాన్ని మార్చడంతో మొన్నటి వరకు పార్టీలో ఉత్సాహంగా పని చేసిన పలువురు నేతలతో పాటు కొంత మంది కార్యకర్తలు స్తబ్ధుగా ఉంటున్నారు. మరికొంత మంది పార్టీ మారేందుకు సన్నద్ధమవుతున్నారు. తాజాగా వికారాబాద్ కు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి ఎ. చంద్రశేఖర్ పార్టీకి రాజీనామా చేయడంతో పాటు కాంగ్రెస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయన బాటలోనే మరికొంత మంది నేతలు ఉన్నట్లు పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రితో పాటు వరంగల్ కు చెందిన మాజీ ఎంపి కూడా చంద్రశేఖర్ బాటలోనే పార్టీ మారేందుకు నిర్ణయించుకున్నట్లు ప్రచారం జోరందుకుంటోంది. నేతలతో పాటు కేడర్ కూడా పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి పక్క పార్టీ వైపు చూస్తుండటంతో కమలం కకావికలమవుతోందన్న ఆందోళన పార్టీలోని కొంత మంది సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంజయ్ మార్పుతో పార్టీలో నెలకొన్న గందరగోళానికి తెర దించాల్సిన అధిష్టానం చేతలుడిగి చూస్తుండటంతో మొదటి నుంచి పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పట్ల విముఖతతో ఉన్న వారిని, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వారిని సంప్రదించి కారణాలేమిటన్న విషయాన్ని తెలుసుకుని సర్ది చెప్పాల్సిన నేతలు ఉంటే ఉండని, పోతే పోని అన్నట్లుగా వ్యవహరించడం దారుణమని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. రాబోయో రోజుల్లో ఇదే పరిస్థితి ఉంటే పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోవడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతే కాకుండా రాబోయే రోజుల్లో మరింత మంది నేతలు పార్టీని వీడిటం ఖాయమని కూడా అంటున్నారు.



## ఆ మూడింటిపై..
# కేసీఆర్ ఫోకస్

కేసీఆర్ ప్రస్తుతం గజ్వేల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014, 2018 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి వరుసగా రెండుసార్లు పోటీ చేసి గెలిచారు. తన స్వంత నియోజకవర్గం కాబట్టి కొన్ని పథకాలను అక్కడి నుంచే ప్రారంభించడంతో రాష్ట్రంలోని ప్రజలందరి దృష్టి ఈ నియోజకవర్గంపై ఉంది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ త్వరలోనే జరుగబోయే ఎన్నికల్లో గజ్వేల్ నుంచి కాకుండా మరో నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారన్న వార్త తీవ్రంగా వైరల్ అవుతోంది. మొదట మంత్రి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ నుంచి కేసీఆర్ పోటీ అని ప్రచారం జరగగా ఆ తరువాత పెద్దపల్లి, కామారెడ్డిలో నియోజకవర్గంలోని ఏదో ఒక చోటు నుంచి పోటీ చేయబోతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే కేసీఆర్ కొత్త నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే ఆ స్థానం నుంచి తప్పించుకోవాల్సి ఉంటుంది.

ఇంతవరకు బాగానే ఉన్నా ఈ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని తహతహలాడుతున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కొంత కంగారు పడుతున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది. సీఎం కేసీఆర్ తమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే తమ గెలుపు అవకాశాలపై కొంత ఆశలు వదులుకోవాల్సి వస్తుందన్న అభిప్రాయాన్ని ఆ పార్టీలు భావిస్తున్న నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులు కొంత వెనక్కు తగ్గుతున్నారన్న చర్చ కూడా జోరందుకుంది. కానీ కేసీఆర్ నియోజకవర్గాన్ని మార్చి మరో చోటు నుంచి బరిలోకి దిగితే దీన్ని ప్రచారాస్త్రంగా మార్చుకోవచ్చని భావిస్తున్నాయి.

బీఆర్ఎస్ నుంచి అసెంబ్లీ బరిలో నిలిచే 87 మందితో కూడిన అభ్యర్థుల మొదటి జాబితాను ఆగష్టు 17 తరువాత ఏ క్షణంలోనైనా సీఎం కేసీఆర్ రిలీజ్ చేసే అవకాశం ఉంది. ఆ తరువాత ఎన్నికల లోపు రెండో జాబితాను సిద్ధం చేస్తారన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఈ జాబితా రిలీజ్ అయితే సీఎం కేసీఆర్ పోటీ చేసే నియోజవర్గంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈసారి కూడా గజ్వేల్ నుంచే పోటీ చేయడానికి కేసీఆర్ సుముఖంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ మరికొన్ని రోజుల్లో కేసీఆర్ పోటీపై క్లారిటీ రానుంది.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రత్యేక ప్రతినిధి /అమ్మన్యూస్ :** ఆదిలాబాద్ నియోజకవర్గం అభివృద్ధి లో వెనుక బడిందని నాలుగు సార్లు ఎన్నికైన ఎమ్మెల్యే జోగురామన్న ఏమీ చేయలేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు.మన చౌరస్తాలో, మన కాంగ్రెస్ మీటింగ్ ,మన పల్లెలో మన కంది శ్రీనన్న నినాదంతో బేల మండలంలో విస్తృతంగా పర్యటించారు. సాంగ్వి , పాట గూడ, జామ్డ సాంగ్వి (కే) గ్రామాలలోని ప్రజలను కలిసి ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించారు.కంది శ్రీనివాస రెడ్డి మీటింగు లకు జనం నుండి మంచి స్పందన వచ్చింది.మేము సైతం మీ వెంటే అంటూ జనం ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఇన్నేళ్ల జోగురామన్న పాలనలో ఒరిగిందేమీ లేదని ఏ ఒక్కరికీ మేలు జరగలేదని అన్నారు. అనేక పథకాలలో ఎమ్మెల్యే జోగు రామన్న కమీషన్లు దండుకుని తన ఆస్తులు పెంచుకున్నారన్నారు. ప్రజల సంక్షేమాన్ని మరిచిన జోగురామన్నను చిత్తుచిత్తుగా ఓడించి ఇంట్లో కూర్చోబెట్టాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ నియోజక వర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఒక్కసారి చేతి గుర్తు ఓటేసి కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే ఏం చేస్తుందన్న విషయాలను వివరిస్తూ కరపత్రాలను పంచి పెట్టారు. అద్భుత మైన మానిఫెస్టోతో ప్రజలకు సేవ చేసేందుకు ముందుకొచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఒక్కసారి గెలిపించి అభివృద్ధి కి దోహదపడాలని కోరారు.



# మాజీ మంత్రి ఇంటికి పీసీసీ చీఫ్

- ఏ చంద్రశేఖర్ తో 10 నిమిషాలు రేవంత్ భేటీ
- కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం

బీజేపీకి రాజీనామా చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన వికారాబాద్ జిల్లా సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి ఎ. చంద్రశేఖర్ ఇంటికి పీసీసీ చీఫ్ వెళ్ళారు. బంజారాహిల్స్ లోని చంద్రశేఖర్ ఇంట్లో రేవంత్ రెడ్డి దాదాపు 10 నిమిషాలు భేటీ అయ్యారు. బీజేపీలో చేరినప్పటి నుంచి కీలకంగా పని చేసిన చంద్రశేఖర్ కొంత కాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. శనివారం పార్టీకి రాజీనామా చేసిన చంద్రశేఖర్ 18 న కాంగ్రెస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. దీంతో చంద్రశేఖర్ ఇంటికి వచ్చిన రేవంత్ రెడ్డి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. భేటీ సందర్భంగా ఇద్దరు నేతలు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై చర్చించారు.